# సత్కార్యాల మధ్య ఘనత భేదం

తన త్రాసు బరువుగా ఉండాలన్న ఆరాటం కలిగి ఉన్న వ్యక్తి ముందు సత్కార్యాలు ఎక్కువగా ఏర్పడినప్పుడు లేదా వాటి ఘనతలో హెచ్చుతగ్గుల భేదం ఏర్పడినప్పుడు ఏ సత్కార్య పుణ్యం ఎక్కువగా ఉందో దానిని ఎంచుకోవాలి, ఆచరించాలి.

ఒక గొప్ప తాబిఈ జాబిర్ బిన్ జైద్ రహిమహుల్లాహ్ చెప్పారు: నాకు అనాథ లేదా నిరుపేదకు ఒక దిర్హమ్ దానం చేయడం నఫిల్ హజ్ (ఫర్జ్ హజ్ కాదు) చేయడం కంటే ఎక్కువ ఇష్టం. (హిల్ యతుల్ ఔలియా 3/90).

ముహమ్మద్ బిన్ మున్కదిర్ రహిమహుల్లాహ్ చెప్పారు: తల్లి సేవ చేసుకుంటూ ఉండడం రాత్రి తహజ్జుద్ చేయడం కంటే ఎక్కువ ఇష్టం. ఆయన అన్నారు: నేను రాత్రంతా నా తల్లి కాళ్ళు ఒత్తుతూ ఉంటిని, నా సోదరుడు తహజ్జుద్ చేసుకుంటూ ఉన్నాడు, నాకు అతని రాత్రి కంటే నా

https://teluguislam.net



రాత్రి ఎక్కువ సంతోషాన్ని కలగజేసింది. (హిల్ యతుల్ ఔలియా 3/150).

ఇబ్ను హజర్ రహిమహుల్లాహ్ చెప్పారు: దానం కంటే నమాజు ఘనత గొప్పదని ఆధారాలున్నాయి, అయినా అగత్యపరుడు ఎదురయినప్పుడు అతని సహాయ నిమిత్తం దానం నమాజు కంటే గొప్పది. (ఫత్ హుల్ బారీ 2/13. హ.నం: 527).

ఇబ్ను ఖయ్యిమ్ రహిమహుల్లాహ్ ఏ సందర్భంలో ఏ ఆచరణ (ఆరాధన) **అఫ్జల్ [అంటే ఎక్కువ ఘనత గలది]** అన్న విషయంలో ఉలమాల భేదాభిప్రాయాలను నాలుగు రకాలుగా ప్రస్తావించారు: వాటిలో నాల్గవ దానిని బలపరచి ఇలా చెప్పారు:

నాల్గవ రకం: ఏ సమయం, ఏ సందర్భంలో ఏ ఆచరణ అల్లాహ్ కు ఎక్కువ ప్రీతికరమో అది చేయడమే **అఫ్జల్.**

కొన్ని ఉదాహరణలు: జిహాద్ సమయంలో జిహాద్ చేయడమే **అఫ్జల్,** దీని వల్ల రేయింబవళ్ళలో చేసే తహజ్జుద్, ఉపవాసాలు లాంటి నఫిల్ సత్కార్యాలు వదలివేయ వలసినా సరే, శాంతి సమయంలో చేసే సంపూర్ణ నమాజు వదలి (ఖుర్ఆన్ లో తెలిపినట్లు) సంక్షిప్త నమాజు చేసినా సరే.

అతిథి వచ్చినప్పుడు అతనికి హక్కు నెరవేర్చుటయే **అఫ్జల్** సత్కార్యం, ఇందువల్ల ఏదైనా ముస్తహబ్ సత్కార్యం విడనాడినా సరే. ఇలాగే భార్య పిల్లల విధులను నేరవేర్చ వలసిన సందర్భంలో ఈ విధులను నేరవేర్చడమే **అఫ్జల్** సత్కార్యం.

సహర్ (ఫజర్ కంటే కొంచెం ముందు) సమయంలో తహజ్జుద్, ఖుర్ఆన్ పారాయణం, దుఆ, జిక్ర్, ఇస్తిగ్ఫార్ లాంటివి చేయడమే **అఫ్జల్.**

https://teluguislam.net



స్టూడెంట్ కు బోధిస్తున్నప్పుడు, అజ్ఞానికి విద్య నేర్పుతున్నప్పుడు ఆ విద్య నేర్పడంలో నిమగ్నులవడమే **అఫ్జల్.**

అజాన్ అవుతున్నప్పుడు వేరే జిక్ర్ తిలావత్ లాంటివి వదిలేసి ముఅజ్జిన్ జవాబివ్వడమే **అఫ్జల్.**

ఐదు ఫర్జ్ నమాజు సమయాల్లో ఆ నమాజులు సంపూర్ణ రీతిలో చేయుటకు మరియు తొలి సమయంలో నేరవేర్చుటకు, జామె మస్జిద్ దూరమున్నా వెళ్ళుటకు త్వరపడుటయే **అఫ్జల్.**

అగత్యపరునికి సహాయం చేయవలసి వచ్చినప్పుడు తన హోదా అంతస్తులు, ధన, ప్రాణాలు ఏ విధంగానైనా అతని సహాయం చేయడంలో నిమగ్నులవడం మరియు అతని అవసరాన్ని తీర్చడం, దీనిని వ్యక్తిగత మరియు పర్సనల్ కార్యాలపై ప్రాధాన్యతనివ్వడమే **అఫ్జల్** సత్కార్యం.

ఖుర్ఆన్ పారాయణ సందర్భంలో మనసు ఏకాగ్రత, అల్లాహ్ నీతోనే సంభాషిస్తున్నాడు అన్నటువంటి భావన గలిగే విధంగా అల్లాహ్ వాక్యాల్లో యోచించుట, వాటిని అవగాహన చేసుకొనుటకు ధైర్య సాహసాలను కూడగట్టుకొనుటయే **అఫ్జల్** ఇబాదత్, సత్కార్యం. ఖుర్ఆన్ ను అర్థం చేసుకొనుటకు, అర్థభావాలలో యోచన చేయుటకు సంపూర్ణ శ్రద్ధ వహించు, అందులో ఉన్న ఆదేశాలను ఆచరించుటకు నిశ్చయించుకో. వాస్తవానికి ఇలా చేయడమే, 'ఏ రాజు నుండైనా వచ్చిన పత్రంపై కలిగే మనసు ఏకాగ్రత కంటే' ఎంతో మేలైనది.

హాజీ హజ్ సందర్భంలో అరఫా లో ఉన్నప్పుడు దీనంగా, వినయంతో దుఆ, జిక్ర్‌లో ఉండడం ఆ రోజు ఉపవాసం ఉండడం కన్నా **అఫ్జల్.**

https://teluguislam.net



జిల్ హిజ్జ తొలి దశలో అధిక ఆరాధన చేయడం ప్రత్యేకంగా తక్బీర్, తహ్ లీల్, తహ్ మీద్ లాంటివి పరిమితము చేయబడని జిహాద్ కన్నా **అఫ్జల్.**

రమజాన్ చివరి దశలో ఏతికాఫ్ గురించి మస్జిదులోనే ఏకాంతంలో ఉండిపోవడం, ప్రజలతో కలవకుండా, మాట్లాడకుండా ఉండడం **అఫ్జల్.** చివరికి ఆ రోజుల్లో ఇతరులకు విద్య నేర్పడం, ఖుర్ఆన్ నేర్పడం కన్నా **అఫ్జల్** అని అనేక ఉలమాల అభిప్రాయం.

ముస్లిం సోదరుడు అనారోగ్యంగా ఉన్నప్పుడు అతడ్ని పరామర్శించడం, అతను చనిపోతే అతని జనాజ వెంట వెళ్ళడం **అఫ్జల్.**

ప్రజల నుండి ఏదైనా బాధ నీకు కలుగుతున్నప్పుడు వారి వదలిపోయేకంటే వారి మధ్య వారితోనే ఉండి సహనం వహించడం **అఫ్జల్.** ఎందుకనగా (ప్రవక్త చెప్పారుః) ఏ విశ్వాసి ప్రజలలో కలసిమెలసి ఉంటూ వారి కష్టాలను భరిస్తాడో, వారి మధ్య ఉండని, వారు ఏ అవస్త కలిగించని వ్యక్తి కంటే **అఫ్జల్.** మంచి విషయంలో వారికి తోడుగా ఉండడం వారితో వేరుగా ఉండడం కంటే **అఫ్జల్.** చెడు విషయంలో వారికి దూరంగా ఉండడం వారితో కలసి ఉండడం కంటే **అఫ్జల్.** వారు చెడులో ఉన్నప్పుడు వారితో కలసి ఉండడం వల్ల వారి చెడును అంతమొందించవచ్చు లేదా నీవు వారిలో ఉండడం వల్ల ఆ చెడు తగ్గవచ్చు అలాంటప్పుడు నీవు వారితో దూరంగా ఉండడం కన్నా కలసి ఉండడమే **అఫ్జల్.** ఏ సమయం, ఏ సందర్భంలో ఆ అల్లాహ్ కు ఏ కార్యం, పని ఎక్కువ ఇష్టమో ఆ సమయసందర్భంలో అది చేయడం **అఫ్జల్.** (మదారిజుస్సాలికీన్: ఇబ్ను ఖయ్యిమ్ అల్ జౌజియ్య 1/88).